# చూపు

" సార్ వీళ్లిద్దరు మాట్లాడుకోవటం లేదు సార్" ఓ యిద్దరు పిల్లలు ఫిర్యాదు చేశారు. వెంకట్‌రెడ్డిని, చంద్రాన్ని తీసుకొచ్చి టీచర్ ముందు నిలబెట్టారు. పుస్తకం చదువుతున్న టీచర్ పేజీల మధ్యన వేలుంచి వాళ్లవైపు కాసేపు మౌనంగా చూశాడు.వెంకట్‌రెడ్డి ఖరీదైన టీ షర్ట్, జీన్స్‌ప్యాంట్ వేసి నున్నగా,చలాకిగా వున్నాడు.

సాదాసీదా వేషధారణ తొణకని ప్రశాంతమైన చూపులతో చంద్ర తన భుజాలు పట్టుకున్న స్నేహితుల పట్టును వొదిలించుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

" ఏమిటి సంగతి" యిద్దర్ని ప్రశ్నిస్తున్నట్టు సైగ చేశాడు టీచర్.

"వీళ్లు మాట్లాడుకోవడం లేదు సార్" అని మళ్లీ వాళ్లే అన్నారు.

"అవునా! అన్నట్టు చూశాడు టీచర్.

ఇద్దరూ మౌనంగా చూస్తువున్నారు, తప్ప మాటలు లేవు.

" చెప్పరేం? " అడిగాడు టీచర్.

అయినా వాళ్లు నోరు విప్పలేదు.

" మూగి వాళ్లయ్యారా? నోరు విప్పండి" టీచర్ గద్దించాడు.

టీచర్‌నే చూస్తూ చంద్రం, నేలను చూస్తూ రెడ్డి, వాళ్లనే చూస్తూ మిగతావాళ్లు. "ఏం రెడ్డి ఎందుకు మాట్లాడుకోవడంలేదు"?

" అయన్నే అడగండి"

"చంద్రం నీవన్నా చెప్పు"

" అయనే మాట్లాడడం లేదు సార్"

" యింతకుముందు బాగానేవున్నారు కదా? అంటూ మిగతావాళ్లవైపు చూశాడు.

" ఉండేది సార్, యిద్దరిదీ ఒకే ఊరు" స్నేహితులుగానే వుండేది.

" అలాగా మరెందుకు మాట్లాడుకోవడం లేదు, ఏమన్న పోట్లాడుకున్నారా" యిద్దరి చూపులను మార్చి మార్చి చూస్తు అన్నాడు

" అదే లేదు సార్" చంద్రం అన్నాడు.

" ఏం రెడ్డి"? ప్రశ్నించాడు టీచర్.

రెడ్డి మాట్లాడలేదు.

ఇంతకుముందు బాగ కల్సి మెల్సివుంటూ రెడ్డి, చంద్రం నోట్స్‌ను అడుక్కునేవాడు తన టెక్స్ట్ బుక్స్ చంద్రానికి యిచ్చేవాడు.

" మరి యిప్పుడేమైంది"?

" ఊళ్లో ఏదో జరిగిందట సార్" మెల్లగ మూర్తి అన్నాడు.

మూర్తి చూడడానికి అమాయకంగా వుంటూనే చుట్టూరవున్న వాళ్ల అందరి సంగతులు ఆరా తీస్తాడు. అంతే కాదు వొకరి వెనుక మరొకరిని ఎగతాళిగ మాట్లాడుతువుంటాడు.

" ఊళ్లో ఏదో జరిగితే - " టీచర్

" అదే చెప్పమంటున్నాం సార్"

"చూడండి మొదట స్నేహితులే కదా!అయితే స్నేహమంటే మాటలు కాదుఅది" అందరు వింటూ నిలుచున్నారు. అది చూసి వ్యాన్ డ్రైవర్ వొచ్చి వాళ్లతోపాటు వింటూ నిలుచున్నాడు. క్లీనర్ బండిని తుడుస్తూవున్నాడు.

" తోటివారిని ప్రేమించడం అనేది ప్రతివానికి వుండవల్సిన ముఖ్యమైన లక్షణం. చాలా మందిలో అదే లోపిస్తున్నది. అందువల్ల అన్నీ సమస్యలే! అయినా అన్నెం పున్నెం ఎరుగని, ఆడే పాడే వయసు మీది. యింతకు ముందు కల్సిమెల్సి తిరిగి యిప్పుడెందుకొచ్చిందటా?"

" వీళ్లు చెప్పరు సార్, వీళ్ళ సంగతి మూర్తికి తప్పక ఎరుకుంటది" రసూల్ అన్నాడు.

" రసూల్ అన్నది నిజమేనా, ఏం మూర్తి?"

"ఏం లేదు సార్ వాళ్ల ఊళ్లో చంద్రంవాళ్ల నాన్న, రెడ్డి వాళ్లనాన్న దగ్గర పాలేరట"

"అయితే?"

"ఏదో గొడవ జరిగిందట, చంద్ర వాళ్లనాన్న ఎదురు తిరిగాడట. రెడ్డి వాళ్ల నాన్న ఆయన్ని పనిలో నుండి తీసేసి, తీసుకున్న అప్పును పైసలేకుంట చెల్లించమన్నాడట. మొత్తంమీద చాల పెద్ద గొడవే అయిందట" అంటూ యిద్దరి వైపుచూసి, మిగతాది చెపితె ఏమనుకుంటారో ఏమో అని సందేహిస్తూ -- ఆగాడు మూర్తి,

" వీళ్ల నాన్న మా నాన్నను కొట్టాడు సార్" చంద్రం అన్నాడు.

" మానాన్న ఊర్కే ఏంకొట్టలేదు" అన్నాడు రెడ్డి.

" వూళ్లో వాళ్లు పోట్లాడుకుంటే, ఇక్కడ మీరు పోట్లాడుకోలేదు కదా?' ' అన్నాడు టీచర్ 'లేదు' అన్నట్టు తల వూపారు. ఇద్దరూ.

" మా నాన్నను కొట్టారని తాను, మానాన్నకు ఎదురు తిరిగాడని నీవు ఎవరకి వారే ఏదేదో అనుకొని ఒకరికొకరు ద్వేషించుకుంటున్నారు కదా?" ఎవరు మాట్లాడలేదు.

" చూడండి పిల్లలు, ఇది దురదృష్టకరమైన ధోరణి, తోటివానిని సమానంగా చూసే సంస్కారాన్ని పెంచుకోవాలి. రెడ్డీ భూస్వామి కొడుకైనా, చంద్రం పాలేరు కొడుకైనా మాకు అందరు సమానమే, పోగా ఎవరు బాగా చదివి ఎక్కువ మార్కులు సంపాదిస్తే, అతనే ఎక్కువ గుర్తించబడతాడు. ఒక పేద పిల్లవాడు బాగా కష్టపడి చదివి డాక్టరో, యింజనీరో, ఐ.ఎ.ఎస్సో అయితే ఆయన స్థితిమారదూ? అందువల్లా తల్లిదండ్రులకున్న ఆస్తులను చూసుకొని ఎగిరి పడడం అవివేకం. రెడ్డీ నీవు చంద్రంతో చేయికలుపు" అంటూ యిద్దరినీ అక్కున చేర్చుకొని తలనిమిరి "యిక పదండి కాస్త చల్లబడదాం" అంటూ అందరూ వ్యాన్‌వైపు నడిచారు. అందరికంటె వెనుక జాన్‌సన్ రెండు రాళ్లను ఒకదానికి ఒకటి రాపిడి చేస్తూ వొస్తున్న నిప్పు రవ్వలను చూస్తు నడుస్తున్నాడు.